
# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



సోమవారం 09 ఫిబ్రవరి 2026


## బోయకొండ గంగమ్మ అమ్మవారి ఊరేగింపు

రామసముద్రం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



రామసముద్రం మండలం, ఆర్. నడింపల్లె గ్రామంలోని శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారిని చుట్టుపక్కల గ్రామాలైనటువంటి ఆర్. నడింపల్లి, ఎగువ నల్లప్పగారిపల్లి, దిగువ నల్లప్పగారిపల్లి, దిగువబొంపల్లి, ఎగువబొంపల్లి, మిట్టపల్లి, మరాలుఇండ్లు గ్రామాలలో అమ్మవారిని డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కర్పూర హారతులతో స్వాగతం పలుకుతూ పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ అమ్మవారిని గ్రామాలలో ఊరేగింపు చేయడం వలన రైతులకు పాడి పంటలు బాగా పండి ప్రజలు సుభిక్షంగా అష్టైశ్వర్యాలతో జీవిస్తారని తెలియజేశారు.

## నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

కడప, ఫిబ్రవరి 08 ప్రభాతవార్త: :

ఈనెల 09వ తేదీన సోమవారం కడప జిల్లా సభాభవన్‌లో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంనకు మంత్రులు, సెక్రటరీలు, హెచ్ ఓడిల కాన్ఫరెన్స్ కారణంగా జిల్లాల నుండి వర్చువల్ విధానంలో ఈ కాన్ఫరెన్స్ నకు జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, హెచ్ఓడిలు అందరూ కలెక్టరేట్‌లో హాజరవుతారని అందువలన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని, ఎవరు అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు రాకూడదని తెలిపారు. కాన్ఫరెన్స్ నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పిజిఆర్ఎస్ రద్దు చేయడం జరిగిందని తెలిపారు. సోమవారం ఉదయం 10:30 గంటల నుండి రోజంతా నిర్వహించబడే కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మరియు అన్ని శాఖల హెచ్ఓడిలు కలెక్టరేట్ నుండి వర్చువల్ విధానంలో పాల్గొననున్నారు. డివిజన్ స్థాయిలో సంబంధిత ఆర్డీవోల ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయిలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మరియు ఇతర అధికారులు తమ తమ కార్యాలయాల నుండి వర్చువల్ విధానంలో పాల్గొనవలసి ఉంటుంది. స్వర్ణ గ్రామాలు మరియు స్వర్ణ వార్డులలో సంబంధిత సచివాలయ సిబ్బంది సచివాలయాల నుంచే ఫిజికల్‌గా హాజరై కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని తెలిపారు.

### స్థానిక సంస్థల ఎన్నికలు

# జరిగేనా ?

## ఓటరు జాబితా ముసాయిదాకు ఎన్నికల కమిషన్ కసరత్తు



రాజంపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయా? రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ మేరకు స్పందిస్తుందా? దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుంది? గత ఏడాది సెప్టెంబర్ 3న కూడా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. తాజాగా మున్సిపాలిటీల పదవీకాలం కూడా మార్చి 17 నాటికి ముగుస్తున్న నేపథ్యంలో మరలా ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందనేది ఇంకా స్పష్టత రాలేదు. ఎందుకంటే సెప్టెంబర్ నోటిఫికేషన్ సమయంలో కూడా ప్రభుత్వం వెంటనే స్పందించలేదు. ఈ నోటిఫికేషన్ వెలువడి 5 నెలలు పూర్తయింది. తాజాగా మరో నోటిఫికేషన్ వెలువడింది. గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2 కు ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ఎలాంటి ఎన్నికల ప్రక్రియ జరగలేదు. తాజాగా మున్సిపాలిటీ పాలకవర్గాలకు పదవి కాలం కూడా మార్చి 17 నాటికి ముగుస్తుంది. ఎన్నికల ప్రక్రియ ఎందుకు ఇప్పటికే కసరత్తు పూర్తి చేయాల్సి ఉన్న సన్నద్ధత జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం జనాభా లెక్కల సేకరణ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల కు వెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా బిసి గణన పూర్తి అయిన తర్వాత వారికి పెద్ద ఎత్తున చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఈ మేరకు క్యాబినెట్ కూడా ఆమోదించింది. దీనితోడు రాష్ట్రఎన్నికల కమిషన్ నీలం సాహ్నీ పదవి కాలం కూడా త్వరలో ముగియనున్న నేపథ్యంలో కొత్త కమిషనర్ నియామకం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కూడా కూడా ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ఏది ఏమైనా కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్థానిక సంస్థల ఎన్నికల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఆ ప్రక్రియ ను నిబంధనల మేరకు చేపడుతుంది. ఎన్నికలు నిర్వహించాలా లేదా అన్నది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలపై జోరుగా ప్రచారం జరుగుతోంది. అధికారిక వర్గాలు మాత్రం ఇప్పట్లో ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక ఎన్నికలు జరపాలన్నా కనీసం మూడు నుంచి ఐదు నెలల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తూ స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

### మార్చి 9న ఓటర్ల జాబితా విడుదల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. వార్డుల వారీగా ఫోటోలతో కూడిన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణకు షెడ్యూల్‌ను ఖరారు చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 9 రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. జనవరి 1, 2026 నాటికి అర్హత కలిగిన ఓటర్ల వివరాల ఆధారంగా ఈ జాబితాను సిద్ధం చేస్తారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని వార్డుల వారీగా జాబితాను సిద్ధం చేసి ప్రచురించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియకు సంబంధించిన తదుపరి విధివిధానాలను కమిషన్ త్వరలోనే వెల్లడించనుంది.

## బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

### నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న పశువర్ధకశాఖ అధికారి

మదనపల్లె, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :

బర్డ్‌ఫ్లూపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలోని సదుం మండలంలోని పుత్తవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాల్లో రెండు కోళ్ళఫారాల్లో కోళ్ళకు బర్డ్‌ఫ్లూ సోకిన నేపథ్యంలో కోళ్ళను ఖననం చేయడానికి జిల్లా కలెక్టర్ పశుసంవర్ధకశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. బర్డ్‌ఫ్లూపై కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, కోళ్ళ నుండి మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకే అవకాశం లేవన్నారు. నూరు డిగ్రీలకు పైగా వేడిచేసిన మాంసంలో ఈ వైరస్ ఉండన్నారు. పోలీసు, రెవెన్యూ, పంచాయితీరాజ్, వైద్యఆరోగ్యశాఖల సమన్వయంతో సదుం మండలం నుంచి ఇతర ప్రాంతాలకు కోళ్ల సరఫరా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సదుం మండలం మినహా మిగతా ఏ మండలాల్లో అసాధారణ కోళ్ళ మరణాలు సంభవించలేదన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎప్పటికప్పుడు నివేధికలు సమర్పిస్తామన్నారు. అనంతరం పశు సంవర్ధశాఖ అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ ముగ్గురు రైతుల కోళ్ళఫారాల్లో అధికసంఖ్యలో కోళ్ళ మరణాలు సంబవించగా చనిపోయిన కోళ్ళ శ్యాంపుల్స్‌ను మధ్యప్రదేశ్, గోపాల్‌లోని హై సెక్యూరిటి ల్యాబ్‌కు పంపగా చనిపోయిన కోళ్ళకు బర్డ్‌ఫ్లై వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. చనిపోయిన కోళ్ళను స్టాండెడ్ ఆపరేటింగ్ ప్రొసిజర్ ద్వారా బ్లిచింగ్ ఫౌడర్, సున్నంలను వినియోగించి కోళ్ళను ఖననంచేసేవిధంగా తెలిపారు. బర్డ్‌ఫ్లూపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆటోల ద్వారా ప్రచారం చేయిస్తున్నామన్నారు. బర్డ్‌ఫ్లూపై ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ రెండు గ్రామాల్లోని ప్రజలు ఎవరైనా కోళ్ళలో అసాధారణ మరణాలు సంబవించడం జరిగితే 7013914401, 9398262752 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాలతో స్పెషల్ డ్రైవ్ నిఘా





మైదుకూరు, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త:

మైదుకూరు పట్టణంలో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు సేవించే వారిపై, అసాంఘిక కార్యకలాపాలపై అనుమానిత ప్రాంతాలపై అత్యాధునిక డ్రోన్ కెమెరాల నిఘా పెట్టారు. మైదుకూరు పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీస్ అధికారులు సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ మరియు డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. మైదుకూరు డివిజన్ డి.ఎస్.పి జి. రాజేంద్ర ప్రసాద్, జిల్లా ఎస్పీ ఆదేశాలతో మైదుకూరు అర్బన్ సి.ఐ కె. రమణా రెడ్డి, అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అనుమానిత ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించడంతోపాటు అత్యాధునిక డ్రోన్ కెమెరాల తో పాటు పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగి జల్లెడ పడుతూ దాడులు చేయిస్తూ నిందితులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. అనుమానిత ప్రాంతాల నుండి పారిపోయిన నిందితులను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి వారిని పట్టుకుని కౌన్సిలింగ్ మరియు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారుల అనుమానిత ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అర్బన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది డ్రోన్ కెమెరాల సిబ్బంది పాల్గొన్నారు.

### చింతకాయల కోతకు వెళ్లి

# ముగ్గురు కూలీల దుర్మరణం

### కూలీల రక్తంతో తడిసిన కర్ణాటక సరిహద్దు

### మరో 15 మందికి గాయాలు





శ్రీనివాసులు, వెంకటమ్మ

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త.

రోజంతా ఎండలో కష్టపడి చింతకాయలు కోసి సాయంత్రం సొంత గూటికి చేరుకోవాలని బొలెరో వాహనంలో ఇంటికి బయలుదేరిన కూలీలు ముగ్గురు మృత్యువాత పడిన విషాదకర సంఘటన ఆదివారం ఆంధ్ర కర్ణాటక సరిహద్దు లో జరిగింది. బ్రేకుల రూపంలో మృత్యువు వారిని వెంబడించి, క్షణాల్లో మూడు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. బొలెరో వాహనం బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందగా, 5 మంది తీవ్రంగా, మరో పదిమంది స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె నియోజకవర్గం, రామసముద్రం మండలం, చెంబకూరు పంచాయతీ, పూలకుంట్లవారి పల్లె, పాతూరు గ్రామాలకు చెందిన శ్రీనివాసులు (25) వెంకటమ్మ (60) మునెప్ప (65) లతో పాటు అశోక్, నరసింహులు, సరోజమ్మ, సావిత్రమ్మ, రత్నమ్మ మరో 10 మంది బొలెరో పికప్ వాన్ లో కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురంకు చింతకాయలు కోసేందుకు వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడ పనులు ముగించుకొని స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని శ్రీనివాసపురం వద్ద వాహనానికి బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు, వెంకటమ్మ, మునెప్ప లు మృతిచెందగా ఐదు మంది తీవ్రంగా గాయపడగా, పది మంది స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి, శ్రీనివాసపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీనివాసపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బర్డ్ ఫ్లూ పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు





సదుం ఫిబ్రవరి 08: ప్రభాతవార్త

సదుం మండలంలోని రెండు కోళ్ల ఫారాలలో గుర్తించిన బర్డ్ ఫ్లూ పై ప్రజలు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తహసిల్దార్ ప్రమీల అన్నారు. ఆదివారం సదుం మండలంలోని పుత్తవారిపల్లె, అమ్మగారి పల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాలలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో కోళ్లను ఖననం చేయడానికి జిల్లా కలెక్టర్ పశుసంవర్ధక శాఖకు ఆదేశాలు జారీ చేశారనీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సదుం మండలంలో గుర్తించిన బర్డ్ ఫ్లూ పై చర్యలు తీసుకునేందుకు పశుసంవర్ధక శాఖకు తగిన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల సమన్వయంతోసదుం మండలం నుండి ఇతర ప్రాంతాలకు కోళ్ల సరఫరా జరగకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు బర్డ్ ఫ్లూ పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. సదుం మండలం మినహా మిగతా ఏ మండలాలలో అసాధారణ కోళ్ళ మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు పుత్తవారిపల్లె, అమ్మగారి పల్లె, కంభం వారి పల్లె, గ్రామాలకు చెందిన ముగ్గురు రైతుల కోళ్ల ఫారాలలో అనూహ్యమైన సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవించగా అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ మొదటి రెండు కోళ్ల ఫారాల నుండి చనిపోయిన కోళ్ల శాంపుల్స్ ను మధ్యప్రదేశ్ భోపాల్ లోని హై సెక్యూరిటీ ల్యాబ్ కు పంపగా చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లుగా తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పుత్తవారిపల్లె మరియు అమ్మగారి పల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాల లోని కోళ్లను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ద్వారా బ్లీచింగ్ పౌడర్ సున్నం లను ఉపయోగించి కోళ్లను ఖననం చేసినట్లుగా పేర్కొన్నారు. కంభం వారి పల్లె గ్రామంలోని కోళ్ల ఫారానికి చెందిన కోళ్ల శాంపిల్స్ యొక్క నివేదిక భోపాల్ నుండి రావాల్సి ఉందని నివేదిక వచ్చిన వెంటనే దానిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఆటోల ద్వారా టామ్ టామ్ వేయిస్తున్నామని పేర్కొన్నారు. కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశాలు చాలా చాలా తక్కువ అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూరు డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతతో వేడి చేసిన చికెన్ ను తినడం వల్ల ఎటువంటి సమస్య ఉండదని ప్రజలు ఈ విషయంలో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సదుం మండలం లో 8 రాపిడ్ టీములు ఏర్పాటు చేసి నివారణ చర్యలు చేపట్టినట్లు తహసిల్దార్ ప్రమీల తెలిపారు.

### ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా

# ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్

కడప క్రైం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:

జిల్లాలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా మరయు కట్టుదిట్టంగా నిరంతరం అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకుంటూ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పుతున్నారు. అనుమానాస్పద వాహనాలను క్షుణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు సైబర్ నేరాల భారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్నారు. భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం చేస్తున్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు, ప్రజల మధ్య ఉంటూ వారికి రక్షణ కల్పిస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

దువ్వూరు, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కడపకర్నూలు జాతీయ రహదారిపై కానగూడూరుకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వరికూటి బాబు(37) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రొద్దుటూరు మండలం చెన్నమరాజు పల్లె గ్రామానికి చెందిన వరికూటి బాబు ట్రాక్టర్ తో జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రొద్దుటూరు నుండి చాగలమర్రి, ఆళ్లగడ్డ వైపు ట్రాక్టర్ లో ఇటుకలు తీసుకొని వెళ్లి అక్కడ విక్రయించుకొని వచ్చేవాడు. అందులో భాగంగా ఆదివారం ఉదయం ట్రాక్టర్ లో ప్రొద్దుటూరు నుండి ఇటుకలు తీసుకుని వెళ్లి చాగలమర్రికి వెళుతుండగా కానగూడూరు సమీపంలో ట్రాక్టర్ కు జంతువు అడ్డు రావడంతో దానిని తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడగా అక్కడికక్కడే వరికూటి బాబు మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు.

## అమ్మవారి శాలలో గీతా జ్ఞాన యజ్ఞ ప్రవచనాలు

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

బ్రహ్మశ్రీ డాక్టర్ యల్వి గంగాధర శాస్త్రి స్థానిక మెయిన్ బజార్ లో వున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి దేవస్థానం (అమ్మవారిశాల)లో శనివారం, ఆదివారం జరిగిన గీత జ్ఞాన యజ్ఞం ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నిత్య జీవితంలో భగవద్గీత గురించి ఆయన ప్రవచనాల ద్వారా తెలియజేస్తూ భగవద్గీత కేవలం ఒక మతగ్రంథం మాత్రమే కాదని, అది ఒక జీవన మార్గదర్శి, మనిషి ఒత్తిడి లో ఉన్నప్పుడు నిర్ణయాలు తీసుకోలేనప్పుడు లేదా జీవితంపై నిరాశ కలిగినప్పుడు సరైన మార్గాన్ని చూపే మానసిక శాస్త్రమే భగవద్గీత అని వివరించారు. ధర్మాన్ని రక్షించు, అది నిన్ను రక్షిస్తుందనే సందేశంతో పాటు, మనిషి తనలోని అజ్ఞానాన్ని వీడి ఎలా జీవించాలో భగవద్గీత నేర్పిస్తుంది అని తెలిపారు. భగవద్గీత ప్రతి ఒక్కరి ఇంట్లో వుంచుకొని ప్రతి రోజు ఒక శ్లోకాన్ని చదివి ప్రతి ఒక్క హిందువు ఆచరించాలని సూచించారు. అన్యమతం కన్నా స్వధర్మమే మిన్న అన్న విషయాన్ని హిందువులకు అందరికి అర్థమయ్యేలా వివరించారు. ప్రతి ఒక్క మాతృమూర్తి తన పిల్లలకు రోజు కొంత సమయాన్ని కేటాయించి మన సంస్కృతి, సాంప్రదాయం, ధర్మం గురించి వివరించి వారు ధర్మమార్గంవైపు నడిచేలా పిన్న వయస్సు నుంచి అమ్మ తొలి విద్యాభోదన చేయాలని వివరించారు. ప్రతి ఒక్క దేవాలయ ప్రాంగణంలో భగవద్గీత అందరికి వినిపించేలా ప్రతిరోజు ఉండాలని సూచించారు. కష్ట సుఖాలలోనూ ధర్మాన్ని వీడకుండా ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తాదులు విరివిగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి అనుగ్రహాన్ని పొందారు. అనంతరం ఆర్యవైశ్య సభ వారు యల్. వి. గంగాధర్ శాస్త్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బుశెట్టి రాంమ్మోహన్ రావు, ఉపాధ్యక్షులు జొన్నల గడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మల్లెంకొండు ప్రతాప్, కోశాధికారి జూలాది పరమేశ్ పర్యవేక్షించి భక్తాదులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షణ నిర్వహించారు.

## విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి..

**బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 08 ప్రభాతవార్త**



బ్రహ్మంగారి మఠం లో స్వామివారి దర్శనార్థం కాణిపాకం నుండి వచ్చిన భక్తుడు వైద్యుల నిరక్ష్యంగ్ల కారణంగా మృతి చెందాడు అనే ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం బ్రహ్మం గారి మఠంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి దర్శనార్థం కాణిపాకం నుండి వచ్చిన భక్తుడు స్పృహతప్పి పడిపోవడంతో వెం టనే కుటుంబ సభ్యులు బాధితుడిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసు కెళ్లగా అక్కడ వైద్యులు కానీ సిబ్బంది కానీ ఎవరు అందుబాటులో లేకపోవడం తో బాధితుడిని మైదుకూరు కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందడం చాలా బాధాకరం అని వారు అన్నారు. భక్తుడు మృతి ఘటనలో నిరక్ష్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బంది, విధులకు హాజరు కాని సిబ్బంది పై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిత్యం భక్తులు మండల కేంద్రానికి వస్తారని అలాంటి భక్తుల వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య శాఖ అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరిం చారు.

## ప్రభుత్వ వైద్యశాలలో పండ్లు పంపిణీ

**ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ముఖ్య అతిథులుగా హాజరైన ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ప్రముఖ వైద్యులు డాక్టర్ టిడి వరుణ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా 200 మంది రోగులకు ఉచితంగా పండ్లు పంపిణీ చేసామని రోటరీ క్లబ్ అధ్యక్షులు గజ్జల వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ టిడి వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలైన ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్, కుటుంబ సభ్యులందరికీ అభినందనలు తెలియజేస్తూ రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయమని రోటరీ సేవలలో పాల్గొనే అవకాశం నాకు కల్పించినందుకు మన ప్రభుత్వ వైద్యశాలలో ఇటువంటి సేవలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గండ్లూరు శ్రీధర శర్మ, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ నరసింహ, రొటేరియన్ గుర్రం రామకృష్ణ, శివోహం అన్న ప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షులు ఎం విష్ణు నారాయణ పాల్గొన్నారు

## రాజ్యాధికారం కోసం బీసిలందరూ ఐక్యం కావాలి



**వేంపల్లె:ఫిబ్రవరి 08(ప్రభాత వార్త)**

రాజ్యాధికారం కోసం బీసిలందరూ ఐక్యం కావాలని భారత చైతన్య యువ జన(బిసివై)పార్టీ పులివెందుల నియోజకవర్గం ఇంచార్జీ సూరే నిర్మలా యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక నేతలతో కలిసి బీసీ సింహగర్జన సభకు సంబంధిత పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ బిసిల హక్కులు, సంక్షేమ, రక్షణకు బిసివై వ్యవస్థాపక అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ కృషి చేస్తున్నారన్నారు. దీనికి అణుగుణంగా బిసివై పార్టీని స్థాపించారన్నారు. విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ప్రత్యేకించి బీసిల రక్షణకు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు రాజధాని ప్రాంతంలో వెయ్యి ఎకరాల భూస్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ బిసి వర్గాల కార్పొరేషన్ లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. వీటి అమలు సాధనకు బిసివై పార్టీ ఆధ్వర్యంలో బిసి సింహగర్జన సభను ఏర్పాటు చేశారని, ఈనెల 22న గుంటూరు, నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలోని పూలే అంబేద్కర్ ప్రాంగణంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పెద్ద ఎత్తున హజరై సభను విజయవంతం చేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్ యాదవ్, సురేష్ యాదవ్, నాగార్జున యాదవ్, సుబ్బారావు, నాగేంద్రర్ యాదవ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలు కాపాడి ప్రజల మన్ననలు పొందాలి

**వేంపల్లె:ఫిబ్రవరి 08(ప్రభాత వార్త)**



వేంపల్లెమండలం వ్యాప్తంగా శాంతి భద్రతలు కాపాడి ప్రజల మన్ననలను పొందాలని టిడిపి మైనార్టీ నేతలు సయ్యద్ పీర్ సాబ్, డాక్టర్ కరీముల్లా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌కు నూతనంగా వచ్చిన తాయార్ హుస్సేన్‌ను మైనార్టీ టిడిపి నేతలు పీరా సాహెబ్, డాక్టర్ కరీముల్లాలు కలిసి శాలువతో సన్మానించారు. వేంపల్లెలో ట్రాఫిక్ సమస్య ఉందని కాబట్టి ట్రాఫిక్ పై ప్రత్యక శ్రద్ధ పెట్టాలని టిడిపి నేతలు ఎస్ఐ ను కోరారు. పాఠశాలల వద్ద పోలీసు నిఘా పెట్టాలని కోరారు. మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలు జరగకుండా కూడ చర్యలు తీసుకోవాలని కోరారు. అందరి సహకరంతో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకొంటామని ఎస్ఐ తాయార్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్త మస్తాన్ పాల్గొన్నారు.

## రెడ్డి కోట వైకాపా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శంకర్ రెడ్డి

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**



మండలంలోని రెడ్డి కోట పంచాయతీ వైకాపా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొప్పుల శంకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు రేపన చౌడేశ్వర తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన రచ్చబండ పార్టీ ఎన్నికల కమిటీ ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు శంకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీకి విధేయుడుగా ఉంటూ పంచాయతీలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## నీటి పరి శుభ్రతకు ..



తాగ డానికి, వంటకు ఉపయోగించే నీళ్లు పరిశుభ్రంగా ఉంటేసగం జబ్బులు రావు. నీటి కాలుష్యాన్ని నివారించడానికి వాటర్ క్యాన్ తెప్పించుకుంటాం కదా! దానికి వాటర్ డిస్పెన్సర్ బిగిస్తే నీళ్లు పరిశుభ్రంగా ఉంటాయి. వంపడం తేలికవు తుంది. పనయ్యాక తీసి ఇంకోదానికి అమర్చవచ్చు. ఇది మేలురకం ప్లాస్టిక్‌తో రూపొందిచ్చారు హానికరం కాదు. దీన్ని శుభ్రపరచ డమూ సులువే.

# చక్కెరతో ఎన్నో రకాల ఉపయోగాలు



నిత్య జీవితంలో చక్కెర పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అయితే కేవలం ఆహార పదార్థాల్లోనే కాకుండా ఇతరత్రా వివిధ సందర్భాలలో చక్కెరను ఎన్నో రకాలుగా ఉపయోగించవచ్చు. తెలుసుకుందాం..

**మరకలు మాయం..** చేతులకు గ్రీజు అంటుకున్నప్పుడు ఒక్కోసారి ఎంత కడిగినా వదలదు. అలాంటప్పుడు లిక్విడ్ హ్యాండ్‌వాష్‌లో కాస్త చక్కెర వేసి ఆ మిశ్రమంతో చేతుల్ని శుభ్రం చేసుకుంటే నగ్రీజు మరకలు పోతాయి. ఇక మనం గార్డెన్‌లో పని చేసునతన్న ప్పుడు దుస్తులకు మట్టిఅంటుకోవడం సహజం.దీన్ని సులభంగా వదిలించుకోవాలంటే గోరువెచ్చటి నీటిలో కాస్త చక్కెర వేసిపేస్ట్‌గా కలుపుకోవాలి. దీన్ని మరక ఉన్న చోట పూసి గంట పాటు పక్కన పెట్టాలి.ఆ తర్వాత శుభ్రం చేస్తే సరిపోతుంది,



**వెండి వస్తువులు మెరవాలంటే....** ఉప్పు గాలి, నీరు కారణంగా వెండి వస్తువులు కొన్ని రోజులకు మెరుపును కోల్పోతాయి. మరి, అలాంటి వాటిని తిరిగి మెరిపించడానికి చక్కెర ఉపయోగపడుతుంది. ఇందుకోసం.. ఒక పాత్రలో మూడు టేబుల్ స్పూన్ల చక్కెర తీసుకొని అందులో టేబుల్ స్పూన్ రోజ్ వాటర్ వేసి చక్కెర కరిగేంత వరకు బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వెండి వస్తువులు కడగడానికి ఉపయోగిస్తే సరి. అవి తళతళా మెరిసిపోవడం ఖాయం.

**దుర్వాసనను పోగొట్టడానికి.....** మిక్సీ జార్లు, కాఫీ గ్రైండర్స్, ఇతర డబ్బాలు.. వంటివన్నీ ఎక్కువ రోజులు వాడకుండా మూతపెట్టి అలాగే ఉంచడం వల్ల కొన్ని రోజులకు వాటి నుంచి అదో రకమైన వాసన వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు ఆ వాసనను తొలగించడానికి చక్కెర బాగా ఉపయోగపడుతుంది. ఇందుకోసం కాఫీ గ్రైండర్స్, మిక్సీ .జార్ల.. వంటి వాటిలో పావు కప్పు చక్కెర వేసి కాసేపు గ్రైండ్ చేయాలి. ఆ తర్వాత కడిగేస్తే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల అందులోని వాసనను చక్కెర గ్రహిస్తుంది. ఇక ఇతర డబ్బాల విషయంలో అయితే ఒక టీస్పూన్ చక్కెరను వాటిలో వేసి మూత పెట్టాలి, తరిగి ఆ బాక్కులను ఉపయోగించుకునే ముందు శుభ్రంగా కడిగితే వాటి నుంచి ఎలాంటి వాసన రాకుండా ఉంటుంది.

**తుప్పు వదలగొట్టండిల..** సామాన్లకు పట్టిన తుప్పును వదలగొట్టే శక్తి చక్కెరకు ఉంది. ఒక నిమ్మకాయ రసాన్ని తీసుకొని అందులో మూడు టేబుల్‌స్పూన్ల చక్కెర వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తుప్పు పట్టిన వస్తువులపై వేసి కడిగితే అవి సులభంగా శుభ్రపడతాయి.

**ఫ్లోర్‌పై మరకలు పడ్డాయా?...** టైల్స్ పై ఏదైనా మరక పడితే అంత సులభంగా వదలదు. అలాంటప్పుడు ఆ మరకను చక్కెరతో శుభ్రపరిస్తే సరి. ఇందుకోసం ఒక గిన్నెలో నాలుగు టేబుల్‌స్పూన్ల వెనిగర్, కద్దిగా చక్కెర తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమంలో దూదిని ముంచి, మరక ఉన్న చోట రుద్దాలి. అంతే మరక ఇట్టే వదిలిపోతుంది.

**మరిన్నీ...** • ఉల్లిపాయలు కట్ చేసిన తర్వాత చేతులకు అంటుకున్న వాసన పోవాలంటే.. టేబుల్‌స్పూన్ చక్కెరకు టీస్పూన్ లిక్విడ్ హ్యాండ్‌వాష్ కలిపి ఆ మిశ్రమంతో చేతుల్ని రుద్దుకోవాలి. ఫలితంగా చేతుల నుంచి వాసన రాకుండా జాగ్రత్తపడచ్చు.



• మూడు టేబుల్ స్పూన్ల చక్కెరకు టేబుల్ స్పూన్ బేకింగ్ పౌడర్ కలిపి కొన్ని నీళ్లు పోసి చిక్కగా చేసుకోవలి. ఈ మిశ్రమంతో పాత్రలను శుభ్రం చేస్తే అవి మరింతగా శుభ్రపడతాయి. ఇది సహజసిద్ధమైన డిటర్జెంట్‌లా పనిచేసి వాటిని మెరిపిస్తుంది.

# కృత్రిమ కాళ్లతో యోగా పాఠాలు !

భవిష్యత్తుపై ఎన్నో కలలు.. వాటిని సాకారం చేసుకోవాలనే ఆలోచనలతో ఆమె జీవితం అందంగా సాగిపోతోంది. అప్పుడే దురదృష్టవశాత్తూ ఓ ప్రమాదంలో తన రెండు కాళ్లనూ కోల్పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా అయితే, నిరాశలో కూరుకుపోతారు. జీవితం ఇక ముగిసి పోయిందనుకుంటారు. కానీ, హైదరాబాద్‌కి చెందిన అర్పితా రాయ్ మాత్రం కృత్రిమ కాళ్ల సాయంతో లేచి నిలబడటమే కాదు.. యోగాసనాలూ వేస్తోంది. శిక్షకురాలిగా మారి పదిమందికీ నేర్పిస్తోంది. ఆ స్ఫూర్తి ప్రయాణాన్ని తెలుసుకుందాం.

కాళ్లు తడవకుండా సముద్రాన్నీ, కన్నీళ్లు కార్చకుండా జీవితాన్నీ దాటలేం.. మరి కష్టమొచ్చిందని జీవన ప్రయాణాన్ని ఆపేస్తే ఎలా? అందుకే, రోడ్డు ప్రమాదంతో ఒక్కసారిగా నా బతుకే తలకిందులైన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. రెండు కాళ్లూ లేకపోయినా నా అంతట నేను లేచి నిలబడగలుగుతున్నా. యోగా టీచర్‌గా మారి మరెంతో మంది జీవితాల్లో స్ఫూర్తి నింపాలనే లక్ష్యంతో సాగుతున్నా. మా స్వస్థలం పశ్చిమ్ బెంగాల్ రాష్ట్రంలోని బ్యారక్‌పూర్. కోల్‌కతాకు 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది మా ఊరు. 2006 ఏప్రిల్ 21. ఆ రోజు సాయంత్రం ఇంటికి అవసరమైన సరకులు తేవాలని స్నేహితుడి బండి మీద బయలుదేరా. ఇక కాసేపట్లో గమ్యం చేరుకుంటాం అనుకుంటుండగా వేగంగా వచ్చిన ఓ బైక్ మమ్మల్ని గుద్దేసింది. ఆ వేగానికి రోడ్డు మీద పడిపోయాం. ఆ వెనకే వస్తోన్న లారీ నా రెండు కాళ్లమీదుగా వెళ్లడంతో నుజ్జయి పోయాయి. వెంటనే ఓ హాస్పిటల్‌కి తీసుకెళ్తే ప్రాథమిక చికిత్స చేసి, పెద్దాసుపత్రికి పంపించారు. అయితే, రెండు కాళ్లకూ ఆపరేషన్ చేయాలంటే లక్షల్లో డబ్బులు కావాలన్నారు. నాకంటే ఏడాది పెద్దయిన అన్నయ్యే మా కుటుంబానికి ఆధారం. చాలా కష్టపడితేనే కానీ డబ్బులు సర్దుబాటు కాలేదు. ఇందుకు పన్నెండు రోజుల సమయం పట్టింది. ఈలోగా గాంగ్రిన్ ఇన్ఫెక్షన్ ఎనభై శాతం ఒంటికి పాకేసింది. వాస్తవానికి ప్రమాదం జరిగిన వెంటనే శస్త్రచికిత్స చేస్తే ఒక కాలైనా ఉండేదేమో! కానీ రెండు కాళ్లూ మోకాలి కింది వరకూ తీసేయాల్సి వచ్చింది. మత్తు దిగాక విషయం తెలిసి గుండెలవిసేలా ఏడ్చా. కానీ, ఫలితం ఉండదని అర్థ మైంది. ఆపై నాలుగు నెలలకు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యా.

**ఎవరి మీదా ఆధారపడొద్దని...** అందరు ఆడపిల్లల్లానే నాకూ కొన్ని కలలు ఉండేవి. ఎయిర్ హోస్టెస్‌గానో, మోడల్‌గానో రాణించాలని అనుకునేదాన్ని. ఆ దిశగా దారులు వేసుకుంటోన్న సమయంలోనే ఈ యాక్సిడెంట్ అంతా తలకిందులైంది. కొందరు జాలి చూపించేవారు. ఇంకొందరేమో నేనెప్పటికీ కుటుంబానికి భారమే అంటూ నిట్టూర్పులు విడిచేవారు. ఇవన్నీ నా మనసుకి బాధ కలిగించేవి. అయినా, ఎన్నాళ్లిలా ఏడుస్తూ కూర్చుంటా.. అందుకే నెమ్మదిగా వాస్తవాన్ని అంగీకరించడం మొదలుపెట్టా. వైద్యులు నా శరీరాకృతి దెబ్బతినకుండా ఉండటానికి రోజూ ఓ గంట నిలబడమన్నారు. పంటిబిగువునన బాధను భరిస్తూ చాలా కష్టంగా అలవరుచుకున్నా. మామూలు మనిషిని కావడానికి చక్రాల కుర్చీలోనే వెళ్లి ఉద్యోగ ప్రయత్నాలు చేశా. చివరికి ఓ కాల్ సెంటర్‌లో చేరా. నాకు ఇతరులపై ఆధారపడటం ఇష్టం ఉండేది కాదు. దీనికోసం నా శరీరం ఫ్లెక్సిబుల్‌గా ఉండాలని భావించా. ఇందుకు యోగా ఉపయోగపడుతుందని చెప్పడంతో కృత్రిమ కాళ్లతో సాధన చేయడం ప్రారంభించా.

**ఫొటోల్లో కాళ్లు కనిపించకుండా..** అంతా నీవల్ల కాదన్నారు. కానీ, ప్రయత్నలోపం ఉండకూడదని గట్టిగాఅనుకున్నా. మొదట చిన్నగా ఆరంభించా. ఆపై కిష్టమై ఆసనాలూ వేయగలిగా. కొన్ని భంగిమ్మర వేయడం సాధారణ వ్యక్తులకైనా కష్టమే. అలాంటి వాటిపైనా నేను పట్టు సాధించగలగడం చూసి అంతా ఆశ్చర్యపోయేవారు. వాటిని ఇన్‌స్టాలో పోస్ట్ చేసేదాన్ని కొత్తల్లో నా కాళ్లు కనిపించకుండా స్కర్ట్‌లు, వదులు పానయంటు వేసుకుని ఉన్న ఫొటోలను మాత్రమే క్రాప్ చేసి అప్‌లోడ్ చేసేదాన్ని కానీ, తరవాత నన్ను నేను అంగీకరించగలిగితేనే ఇతరులూ ఇష్టపడతారని అర్థం చేసుకున్నా. అంతా అభినందించడంతో నాలో మరింత ఉత్సాహం వచ్చింది. నేనూ ఇతరులకూ బోధించ గలనన్న నమ్మకం వచ్చాక ఉపాధ్యాయ కోర్సులు చేశా. తరవాత యోగా టీచర్ ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డా. అలా 2019 నుంచి ఔత్సాహికులకు యోగా పాఠాలు నేర్పించడం ఆరంభించా. ఒకరిద్దరితో మొదలైన ఈ తరగతుల్లో కొవిడ్ ముందు నాటికి ఇద్దరు దివ్యాంగులతో సహా పాతికమంది విద్యార్థులు ఉండేవారు. వారీ విషయాన్ని మరికొంతమందితో చెప్పడంతో క్రమంగా ఆసంఖ్యపెరిగింది.

# చూపు లేకున్నా ఫుట్‌బాల్ ఆడేస్తోంది!

**ఆ స్టేడియంలో ఫుట్‌బాల్ క్రీడ జరుగుతోంది. అయితే ఆడేవాళ్లు కళ్లకి గంతలు కట్టుకుని ఉన్నారు. అయినా బడుపుగా బంతిని కాళ్లతో తోస్తూ గోల్ దిశగా నడిపిస్తున్నారు. వాళ్లలో ఒకరు.. 26 ఏళ్ల నిర్మా మనుభాయ్ ఠాకర్దా. ఆమె గాలిలో వస్తోన్న బంతి వేగాన్నీ నేలపై అది కదిలే శబ్దాన్నీ అంచనావేస్తూ సునాయాసంగా ఫుట్‌బాల్ ఆడేస్తోంది. సాధనతో కొద్దికాలంలోనే అంతర్జాతీయ క్రీడాకారిణిగా నిలిచింది.**

గుజరాత్, సబర్‌కాంతా జిల్లాలోని రెహదా గ్రామంలో ఓ పేద కుటుంబంలో పుట్టింది నిర్మా. తండ్రి మనుభాయ్‌రైతు. తల్లి లఖూబెన్ గృహిణి. మనుభాయ్ పుట్టుకతోనే అంధురాలు. ఆమెకు చూపు తెప్పించడం కోసం ఆసుపత్రులన్నీ



తిప్పారు. కంటిలోని [redacted] చెప్పారు వైద్యులు. దాంతో తీవ్ర వేదనకు గురయ్యారు తల్లి దండ్రులు. ఎలాగో గుండె దిటవు చేసుకుని చదివించాలని అనుకున్నారు. అందుకుని స్కూల్లో చేరుద్దామని తీసుకెళ్తే అంధులకి ప్రవేశం లేదన్నారు. గ్రామ సర్పంచి సిఫార్సుతో ప్రాథమిక పాఠశాలలో నిర్మాకు చోటిచ్చారు. స్కూల్‌లో తోటి విద్యార్థుల్లా బోర్డుపై అక్షరాలు చదవలేను. వినడం తప్ప రాయలేను. దీంతో చాలా ఇబ్బంది పడేదాన్ని. టీచర్ పాఠం చెబుతుంటే త్వరగా అర్థం చేసుకోలేకపోయేదాన్ని. దాంతో తోటిపిల్లలను అడిగి తెలుసుకుందామని ప్రయత్నించేదాన్ని. కానీ క్లాసులో వాళ్లెవరికీ నేనొకదాన్ని ఉన్నాన్న ఆలోచనే ఉండేది కాదు. కష్టంగా అనిపించేది. అప్పుడు నాలాంటి వారి కోసం నడుపుతున్న ఒక ఎన్జీవో గురించి కనుక్కున్నారు నాన్న. అది నా జీవితాన్ని ఊహించని మలుపు తిప్పింది అంటోంది నిర్మా.

**బ్రెయిలీ నేర్చుకున్నా....** నిర్మా ఉండే గ్రామానికి 13 కిలోమీటర్ల దూరంలో 'నేషనల్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్' అనే ఓ సేవాసంస్థ ఉంది. అంధులు, వైకల్యం ఉన్నవారికి చేయూతని అందిస్తోన్న ఆ సంస్థలో ఆమెను చేర్చాడు తండ్రి. అక్కడే బ్రెయిలీ నేర్చుకుంటూ చదువు [redacted] నన్ను చదివిస్తోంది అంటుందిమె.

**ఫుట్‌బాల్ గురించి విని.....** కాలేజీలో తనలాంటి అంధ విద్యార్థి విష్ణు వఘేలా ఫుట్‌బాల్ ఆడుతున్నాడని తెలిసి, ఓసారి వివరాలు అడిగింది నిర్మా. ఫుట్‌బాల్ ఆడే విధానం నచ్చి, ఆసక్తి పెంచుకుంది. అప్పటివరకు ఫుడ్‌బాల్ గురించి తెలీదు. విష్ణుని నేర్పమని అడిగారు. తీరా పాస్, కిక్ నేర్చుకున్నప్పుడు కిందపడి దెబ్బలు తగలడం, తోటి క్రీడాకారుడిని ఢీకొనడం జరిగేవి. కంగారు పడేదాన్ని, మొత్తమ్మీద ఎలాగో నానా కష్టాలూ పడి ఈ క్రీడలో శిక్షణ



తోసుకున్నా. బాగా ఆడగలను అని నా మీద నాకు [redacted] 'ద ఇంటర్నేషనల్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ (ఐబిఎస్ఎ)' ఛాంపియన్‌షిప్‌లో అయిదు మ్యాచ్‌లు ఆడింది. మాతృదేశం తరఫున ఇటీవల అంతర్జాతీయస్థాయి పోటీలకు ఇంగ్లండ్, జపాన్ వెళ్లింది. 'విమానమెలా ఉంటుందో కూడా తెలియని నేను విదేశాలకి వెళ్లడంకన్నా, దేశం కోసం ఆడుతున్నందుకు గర్వంగా ఉంది. ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించాలన్నదే నా లక్ష్యం అని చెబుతున్న నిర్మా కల నెరవేరాలని కోరుకుందాం.

## ఆరోగ్యానికి 'సూపర్ సిక్స్'

ఆహారం ప్రపంచంలో అత్యున్నతమైనవిగా. సూపర్‌ఫుడ్స్‌కి పేరు. అసలు వీటిని ఎవరు, ఎప్పుడు ప్రచారంలోకి తెచ్చారో తెలియదు కానీ ఈ జాబితాలో చాలానే ఉన్నాయి. అకైబెర్రీ, అవకాడో, కాలే, మాచా వంటివి ఎక్కువగా ఆదరణ పొందుతున్నాయి. వీటిల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు పుష్కలం. అయితే, అదే స్థాయిలో న్యూట్రియంట్లను నింపుకొన్ని దేశీయన సూపర్‌ఫుడ్స్ ఏంటో చూద్దాం.

**సూపర్‌ఫుడ్స్,,** ఈ మధ్యకాలంలో బాగా వినబడుతోన్న పదం. వీటిల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయనీ, దీర్ఘకాలిక వ్యాధుల్ని అదుపులో ఉంచుతాయనీ చెబుతున్నారు. అలాంటి వాటిల్లో ఎక్కువగా విదేశీ రకాలే కనిపిస్తున్నాయి కానీ, వాటికి దేశీయ ప్రత్యామ్నాయాలూ ఉన్నాయంటారు పోషక నిపుణులు.

**అకై బెర్రీ-ఉసరి..** చూడడానికి అచ్చం నల్లనద్రాక్షలా ఉండే అకై బెర్రీ, ఉసిరి రెండు ఒకే రకమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉన్న శక్తివంతమైన సూపర్‌ఫుడ్‌లు. విటమిన్ సి నిల్వల్లో అకై బెర్రీని మించిన ప్రయోజకారి ఉసిరి. దీంతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పైగా ఉసిరిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్,యాంటీవైరల్ లక్షణాలూ నిండుగా ఉంటాయి. ఇది దీర్ఘకాలిక వ్యాధుల్నే కాదు.. కాలేయ ఆరోగ్యం, అధికబరువుని తగ్గించడంలోనూ కీలకంగా పనిచేస్తుంది.

**మాచా మునగ ...** మాచా అనేది నీడలో పెరిగే లేత తేయాకుని సంప్రదాయ పద్ధతుల్లో చేసే పొడి. తీపి, చేదు, వగరు కలగలిపిన రుచిలో ఉండే దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి సెల్ డ్యామేజీని నిరోధించడంతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలోనూ కీలకంగా పనిచేస్తాయి. దీనికి భారతీయ ప్రత్యామ్నాయాన్ని మునగాకు అందిస్తుంది. ఇందులో కీలక విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లతో పాటు తోణ శక్తినిందించే గుణాలూ ఎక్కువే. అందుకే దీన్ని పోషకాల పవర్‌హౌస్ అని పిలుస్తారు.

**చియా సీడ్స్-సబ్జాగింజలు..** చియా గింజల్నే మెక్సికన్ సీడ్స్ అని కూడా అంటారు. వీటిల్లో ఫైబర్, ఒమేగా-3 సమృద్ధిగా ఉంటాయి. ఒంట్లో వ్యాధినిరోధకతను పెంచుతాయి. ఈ గింజలు జిగురుగా ఉండటం వల్ల వీటినెక్కువగా స్మూతీలు, సాధారణ పుడ్డింగ్‌లను చిక్కబరచడానికి వాడతారు. అయితే వీటి కంటే ఖరీదు తక్కువగా ఉండే సబ్జా గింజల్ని దేశీయ సూపర్‌ఫుడ్‌గా వినియోగించొచ్చని అంటున్నారు నిపుణులు. ఎక్కువ ప్రొటీన్, తక్కువ కెలోరీలు ఉన్న ఇవి ఒంట్లో వేడిని నియంత్రించడంతోపాటు అవసరమైన శక్తినీ ఇస్తాయి. ఈ గింజల్లో ఐరన్ ఫైబర్ పుష్కలంగా ఉండి జీర్ణవ్యవస్థ పనితీరునీ మెరుగుపరుస్తాయి.

# ఎక్స్‌పైరీ తేదీ చూస్తున్నారా?

**మార్కెట్లో ఏ వస్తువు కొన్నా.. దానిపై తయారీ తేదీ, గడువు తేదీలు కచ్చితంగా రాసుంటాయి. అవి ఎప్పుడు తయారయ్యాయి? ఎంతకాలం వరకు వినియోగించడానికి సురక్షితం? అనే విషయాల్ని ఇవి తెలియజేస్తాయి.** అయితే వీటితో పాటు షెల్ఫ్‌లైఫ్/ యూజ్ బై అని కూడా కొన్నిటి మీద రాసుంటుంది. చాలామంది ఇది, గడువు తేదీ ఒకటేనేమో అని పొరబడుతుంటారు. కానీ ఈ రెండింటికీ స్వల్ప వ్యత్యాసం ఉందంటున్నారు నిపుణులు.



లేబుల్‌ని సునిశితంగా పరిశీలిస్తే ఆ తేడాను ఇట్టే పసి గట్టేయచ్చంటున్నారు. మరి, అదేంటో తెలుసుకుందాం..

**రెండాంటి మధ్య తేడా ఏంటంటే...** మార్కెట్లో కొనే ఉత్పత్తులపై తయారీ, గడువు తేదీలు ఉంటాయన్న విషయం తెలిసిందే! అయితే వీటితో పాటు షెల్ఫ్‌లైఫ్‌ని కూడా ఆయా సంస్థలు లేబుల్‌పై పేర్కొంటాయి. కానీ ఇది, గడువు తేదీ ఒకటేనేమోనని అనుకుంటారు కొందరు. అయితే ఈ రెండింటి మధ్య స్వల్ప వ్యత్యాసం ఉందంటున్నారు నిపుణులు.

**గడువు తేదీ అంటే...** ఒక ఉత్పత్తిని ఎన్ని రోజుల తర్వాత అస్సలు వాడకూడదో తెలియజేసే కాల పరిమితి. ఆ తర్వాత దాని ప్రభావం తగ్గిపోవడమే కాదు.. అది హానికరం కూడా అని దీని అర్థం.



**అదే షెల్ఫ్ లైఫ్ విషయానికొస్తే..** ఉత్పత్తిని తెరిచిన తర్వాత.. దాని లేబుల్‌పై పొందుపరిచిన నియమ నిబంధనలకు అనుగుణంగా సరైన నాణ్యతా ప్రమాణాలతో దాన్ని నిల్వ చేయడం/భద్రపరచడం చేస్తే అది ఎంత కాలం సురక్షితంగా ఉంటుందని తెలియజేసే సూచిక ఇది. ఉదాహరణకు 12ఎం అని ఉంటే.. దానికి 12 నెలల షెల్ఫ్ లైఫ్ ఉందని అర్థం! సాధారణంగా దీన్ని ఉత్పత్తిపై 'యూజ్ బై' లేదా సెల్ బై అనే పదాలతో సూచిస్తారు.

షెల్ఫ్ లైఫ్ దాటినప్పుడు ఒకవేళ గడువు తేదీ మీరకపోయినా ఆయా ఉత్పత్తుల్ని వాడకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. ఆహారం, మందులు, కాస్మెటిక్స్. వంటి ఉత్పత్తుల్ని ఉపయోగించే క్రమంలో ఈ రెండు తేదీల్ని దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యమంటున్నారు. తద్వారా ఆహారం, అందంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపచ్చంటున్నారు.

**నిల్వ చేయడమూ ముఖ్యమే!...** అయితే మార్కెట్లో కొన్ని ఉత్పత్తి ఏదైనా సరే.. వాటిపై పేర్కొన్న గడువు, షెల్ఫ్ లైఫ్ తేదీలకు అనుగుణంగా మన్నాలంటే దాన్ని నిల్వ చేసే లేదంటే భద్రపరిచే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. లేదంటే వాటి నాణ్యత తగ్గిపోయే ఆస్కారం ఉందంటున్నారు ఇందులోసం ఆయా ఉత్పత్తులపై పేర్కొన్న లేబుల్స్‌ని సునిశితంగా పరిశీలించాలంటున్నారు. ఉదా: ఫ్రిజ్‌లో పెట్టే ఉత్పత్తుల్ని లేబుల్‌పై పేర్కొన్న ఉష్ణోగ్రత వద్ద భద్రపరచడం ముఖ్యం అలాగే ఆహారం, మందుల్ని ఫ్రిజ్‌లో లేదంటే బయట ఉంచినా.. సరైన నిల్వ ప్రమాణాల్ని పాటించాలి.

## రీసర్వేకు మాత్రమే గ్రామసర్వేయర్ల సేవలు

**నిమ్మనపల్లె, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:**

ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వే కార్యక్రమానికి ఎలాంటి అడ్డంకులు తలెత్తకుండా ఉండేందుకు గ్రామ సర్వేయర్ల సేవలను రీసర్వేకు మాత్రమే ఉపయోగించుకునేలా ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసిందని తహశీల్దార్ తపస్వని తెలిపారు. సంక్షేమ పథకాల అమలలో భాగంగా ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు విఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సర్వేయర్లను ప్రస్తుతం ఉపయోగించుకోవడం జరుగుతోందన్నారు. అయితే ఇకపై ప్రతినెలా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం తప్పా ఇతర ఏ ప్రభుత్వ కార్యక్రమాల్లో విఆర్ఓ, సచివాలయ సర్వేయర్ల సేవలు ఉపయోగించుకోకూడదన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లోపు రీ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సహకరించాలన్నారు. రీసర్వేలో భాగంగా విఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు పనిచేసే ప్రదేశాల్లోనే హెచ్‌ఆర్ఎంఎస్ ద్వారా హాజరు నమోదు చేయాల్సి ఉందన్నారు.

## గిరిజనులకు గుర్తింపు కార్డుల పంపిణీ

**కె.వి పల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:**


గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న దృశ్యం

మండలంలోని సొరకాయలపేట గ్రామంలో గిరిజన సహకార సంస్థ వారితో కలసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దం శ్రీనివాసులు ఆధ్వర్యంలో గిరిజనులకు అటవీ హక్కుల గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులుతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గుర్తింపు కార్డు కలిగిన గిరిజనులు మాత్రమే అడవిలో లభించే ఫలసాయ ఉత్పత్తులను సేకరించి గిరిజన సహకార సంస్థ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు అర్హులని తెలిపారు. ఇతరులకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ నియమాలు ఉల్లంఘించినా, అడవి జంతువులకు హాని కలిగించినా కార్డు రద్దుతో పాటు కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రెజరర్ టేకుమందా రెడ్డప్ప, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు కిల్లా విజయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ తిరుమల శెట్టి రమణ, టేకుమంద లక్ష్మయ్య, గిరిజన సహకార సంస్థ గోడౌన్ ఇంచార్జ్ సి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**పీలేరు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త;**



నియోజకవర్గంలోని గుర్రంకొండ మండలం, తరిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కీచక ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలికిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బిడ్డలతో సమానమైన విద్యార్థినులను లైంగికంగా వేధించడం నీచమైన చర్య అని, ఇలాంటి వ్యక్తులకు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగేందుకు ఎలాంటి హక్కు లేదని స్పష్టం చేశారు. బాధిత విద్యార్థినులకు న్యాయం జరిగేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి కీచక ఉపాధ్యాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## రాజకీయ కక్షతోనే కుట్ర

**జనసేన నేత మైఫోర్స్ మహేష్**

**మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త.**



తనకు గానీ, పార్టీకి గానీ సంబంధం లేని గొడవలోకి తన పేరును లాగి రాజకీయ కక్షకు పాల్పడుతున్నారని జనసేన పార్టీ నేత మైఫోర్స్ మహేష్ మండిపడ్డారు. గత నెల 29న ఎంజీ గ్రాండ్ రెస్టారెంట్ వద్ద జరిగిన పార్కింగ్ వివాదంపై ఆయన ఆదివారం స్పందించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తన తమ్ముడిపై ప్రత్యర్థులే దాడి చేశారని, ఆ దృశ్యాలు సిసి కెమెరా పుటేజీలో స్పష్టంగా ఉన్నాయన్నారు. నా తమ్ముడు ఉమేష్ కత్తితో దాడి చేశాడనడం పచ్చి అబద్ధం అని ఆ సమయంలో అతని చేతిలో గడ్డిపరక కూడా లేదని పుటేజీ చూస్తే అర్థమవుతుందన్నారు. ఒక వ్యాపార స్థలంలో జరిగిన చిన్న వివాదాన్ని రాజకీయ కక్షతో ఇంత పెద్దది చేయడం తగదన్నారు. న్యాయం తన వైపు ఉందని, సీసీ కెమెరా పుటేజీని ప్రజల ముందు ఉంచుతున్నానని, ప్రజలు వాస్తవాలను గ్రహించి తనకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

## ఫ్లూజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి : డి.ఎమ్.హెచ్.ఓ

**సదుం ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**



ఫ్లూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాకాధికారి లక్ష్మీనరసయ్య అన్నారు. ఆదివారం సదుం మండలంలోని కంభం వారి పల్లి, అమ్మగారిపల్లి, పుట్టావారిపల్లి గ్రామాల్లో పర్యటించి అక్కడ గల కోళ్ల పారాలను జిల్లా సర్వలెన్స్ అధికారి శ్రీధర్‌తో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ ప్రజలకు ఫ్లూ జ్వరాలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రత పాటించాలనీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ చెప్పారు. ఈ కార్యక్రమంలో చెరుకు వారి పల్లి పీహెచ్సీ వైద్యులు గాయత్రి, చిత్తూరు జిల్లా సర్వలెన్స్ అధికారి డాక్టర్ అనిల్, ఎపిడెమోలజిస్ట్ శ్రీవాని, డిప్యూటీ హెచ్. ఈ.ఓ. మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు నాగరాజు, శికామనిమరియు పీ. హెచ్.సి. సిబ్బంది పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి**



**రాజంపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**

కార్మికుల సమస్యల కోసం దేశవ్యాప్తంగా ఈనెల 12వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి కోరారు. ఆదివారం రాజంపేట ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని, యజమానులకు విపరీత లాభాలు తీసుకొస్తాయన్నారు. స్వాతంత్రం ముందు నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసిన మోడీ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు లబ్ధిచేకూరుస్తోందన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు సమగ్ర చట్టం లేదని, గ్రామీప్రాంతంలో అమలు చేస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి, స్కీముగా మార్చారని, కేంద్రం ఇచ్చే నిధుల్లో కోత పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర, జిల్లా సహాయ కార్యదర్శి ఈ సికిందర్,ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, భవన నిర్మాణం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహులు ,హమాలి యూనియన్ రవికుమార్, ఏఐటీయూసీ నాయకులు రమణ, దస్తగిరి, సురేష్, కోటి బజారి రాఘవ రమేష్ మహేష్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల నృత్యాలు అదుర్స్..

**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:**

శిల్పారామంలో సాయంత్రం 6.30 నిమిషాలకు సాంస్కృతిక కళావేదిక మీద పద్మాకర్ వారి సహకారంతో కడప నగరానికి చెందిన నేతరాన్వి డాన్స్ అకాడమీ బృందం పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను అదరహో అనిపించారు. రానురాను ముంబై రాను, వృక్షమ్, ఆయుధపూజ వంటి పాటలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి ఇంచార్జ్ డి. వెంజటసుబ్బయ్య పర్యవేక్షించారు.

## మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్: సీఐ

**ముద్దనూరు, ఫిబ్రవరి 08 ప్రభాతవార్త:**



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లకు, అనుమానితులకు కౌన్సెలింగ్ నిర్వహించామని సీఐ నగేశ్‌బాబు తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్లో సీఐ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్గొనకుండా మంచి ప్రవర్తన కొనసాగించాలని ఆయన రౌడీ షీటర్లకు సూచించారు. మండలంలో స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. ఎంతోమంది ఫ్యాక్షన్ ముఠా కక్షల జోలికి వెళ్లి వాళ్ల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని మీ పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచించి సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. మీకు ఏదైనా సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ వెలుగు నింపింది

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**



ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరుతో ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడి మా కుటుంబాలలో వెలుగులు నింపిన సీఎం చంద్రబాబు నాయుడుకు రుణపడి ఉంటామని లబ్ధిదారులు తెలిపారు. ఆదివారం మండలంలోని కోసువారిపల్లి పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన ఆరు మంది గతంలో పలు ప్రమాదాలు, వ్యాధులు సోకి అప్పులు చేసి చికిత్సలు చేయించుకున్నారు. వారి ఆర్థిక ఇబ్బందులు గుర్తించిన టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ బేరిశ్రీనివాసులు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి నిధులు మంజూరుకు సహకరించారు. ఆదివారం టిడిపి, కూటమి నేతలు 6 మంది లబ్ధిదారులకు రూ ఆరు లక్షల పైచిలుకు నిధుల చెక్కులను లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు స్థానిక టిడిపి, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో బయమ్మచెరువు సంఘ అధ్యక్షుడు ఆదిరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మహారాజ్ జయంతి ఉత్సవాలు

**మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త.**



అఖిల భారత బంజారా సేవా సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పి. అమరేందర్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం సంత్ సేవాలాల్ మహారాజ్ ముందస్తు జయంతి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో బంజారాలు తమ ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ పూజలు నిర్వహించి, వైభవంగా ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి సేవాలాల్ మహారాజ్ ట్రస్ట్ పీఠాధిపతులు, రాష్ట్ర అఖిల భారత బంజారా సేవా సంఘం అధ్యక్షులు ఆంజనేయులు నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అలాగే రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ నాయక్, విశ్వనాథ్‌నాయక్, నక్కల దిన్నె తాండ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాలను, ఆయన గొప్పతనాన్ని ప్రతి తాండకు, ప్రతి ఇంటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎంప్లాయిస్ యూనియన్ మరియు జిల్లా కమిటీపై ఉందన్నారు. ఈ వేడుకల్లో ఏబీఎస్ఎస్ జిల్లా సెక్రెటరీ వేణుగోపాల్ నాయక్, జిల్లా కోశాధికారి ముని కుమార్ నాయక్, గంగా నాయక్, ప్రభాకర్ నాయక్, సునీల్ నాయక్, ఏఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు నాగు నాయక్, కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విఎస్ ముక్తియార్ ఘన సన్మానం

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**



ఏపీ రాష్ట్ర షేక్/శీక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్‌గా నియమితులైన విఎస్ ముక్తియార్‌ను ప్రొద్దుటూరు అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సీఎం సురేష్ నాయుడుల చేతుల మీదుగా ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా తాను ముక్తియార్ రాజకీయంగా ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నామని, ప్రొద్దుటూరులో ప్రజల సహకారంతో శాంతియుత వాతావరణం ఏర్పాటు చేశామని వివరించారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్ నాయుడు మాట్లాడుతూ భవిష్యత్తులో ముక్తియార్ మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ వి.ఎస్. ముక్తియార్ మాట్లాడుతూ ప్రస్తుతం బిసిలో కొనసాగుతూ బిసి ఈగా వున్న షేక్‌ల అభివృద్ధి సంక్షేమం కోసమే షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటైందని తెలిపారు. త్వరలో ప్రస్తుతం వున్న అషారే షరీఫ్‌ను ఆధునీకరించడంతో పాటు, ప్రభుత్వ సహకారంతో కమ్యూనిటీ హాల్ కూడా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్ అహ్మద్, ప్రభుత్వ ఖాజీ నజీర్, పలువురు మైనార్టీ ప్రముఖులు, అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ సభ్యులు బొల్లవరం బాషా, ఇక్బాల్ సాహెబ్, రాయల్ గౌస్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి(శునక) ప్రేమ...!

**చౌడేపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**


దెబ్బతిన్న కుక్కపిల్లను తీసుకెళుతున్న శునకం

సృష్టిలో వెలకట్టలేనిది ఏదైనా వుందంటే అది తల్లి ప్రేమ ఒక్కటే...తన మరణంలోనూ కన్న పేగును బతికించుకొన్న అమ్మలను చూశాం...అలాంటి అమ్మ ప్రేమను గురించి రాసేందుకు అక్షరాల్లేవు చెప్పేందుకు మాటల్లేవు... కడుపార కన్న శనకంపై స్కూటర్ పోవడంతో రోడ్డున పడి ఏడ్చుకొంటూ వుండగా ఎక్కడి నుంచి వచ్చిందో తల్లి శనకం స్కూటరిస్టును వెంబడించి మరీ తరుముకొంది. అతను స్పీడ్‌గా వుడాయించడంతో బిడ్డ కష్టం చూసి చుట్టూ తిరిగి తీసుకెళ్ళి కాపాడే ప్రయత్నం చేసింది. కొందరు దాన్ని రక్షించేందుకు వచ్చినప్పటికీ వారినెవ్వరినీ దగ్గరికి రానివ్వకుండా పిల్ల శునకాన్ని నోట కరచుకొని వెళ్ళి పోయింది. ఏ జీవిలోనైనా తల్లి ప్రేమ ఇలానే వుంటుందన్నారు.

## పల్లెపండగ పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు

**మదనపల్లె, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**

పల్లెపండగ పథకం వివిధ గ్రాంట్లు కింద గ్రామీణ ప్రాంతాల్లో తారురోడ్లు నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో సుమారు రూ.55.14కోట్లతో తారురోడ్లు, సిసిరోడ్లు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇన్నాళ్ళు గుంతల రోడ్లతో ఇబ్బందులు పడ్డ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ రోడ్ల నిర్మాణాలతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఆర్అండ్‌బి, పంచాయితీరాజ్ శాఖల ఆధ్వర్యంలో రోడ్లు పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హాయాంలో అర్ధాంతరంగా ఆగిపోయిన గ్రామీణ రోడ్లు పనులు కూడా పల్లె పథకం కింద రోడ్లునిర్మాణాలను చేపడుతున్నారు.


రూరల్ మండలంలో చేపడుతున్న తారురోడ్డు

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఎస్పై ఆరా

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**



మండల కేంద్రం సమీపంలోని మల్లయ్య కొండలో మహాశివరాత్రికి జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యాలు, తదితర ఏర్పాట్లపై ఎస్సై అనిల్ కుమార్ దేవాదాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహాశివరాత్రి రోజున వచ్చే వేలాదిమంది భక్తులకు రవాణా సౌకర్యం, వాహనాలకు కొండపైన, కొండ కింద పార్కింగ్ ఏర్పాట్లు, కొండపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరా తీశారు. మల్లయ్య కొండపై శివరాత్రి రోజున స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు, అన్నదాన కార్యక్రమానికి ఏర్పాటుచేసిన వాలంటీర్ల వివరాలు మంజూరు చేయాల్సిన పాసులు పై విచారణ చేశారు. మహాశివరాత్రి పర్వదినం భక్తులు సమన్వయం పాటించి స్వామివారిని దర్శించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని ఎస్సై ఓ ప్రకటనలో కోరారు. ఆయన వెంట ఏఎస్ఐ నజీర్ భాష, కానిస్టేబుల్ రాఘవ, అన్నదాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## గుడి నిర్మాణానికి సుముఖత అభినందనీయం

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి**

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు పట్టణంలోని ఎర్రగుంట్ల రోడ్డులో అటవీ అధికారులు తొలగించిన వారాహి మాత అమ్మవారి గుడి నిర్మాణం చేపట్టేందుకు అటవీ అధికారులు సుముకుత వ్యక్తం చేయడం అభినందనీయమని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వారాహి మాత గుడిని సందర్శించిన ప్రదీప్‌రెడ్డి అధికారులతో మాట్లాడి గుడి నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేయించారు. ఈనెల 5 వ తేదీన ప్రొద్దుటూరులోని అయ్యప్ప స్వామి టెంపుల్ సమీపంలో వారాహి అమ్మవారు దేవాలయాన్ని ఫారెస్టు అధికారులు కూల్చిన సందర్భంలో బీజేపీ పైఅధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఆయన పరిశీలించి ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ భూమి రెడ్డి లక్ష్మీకుమారితో మాట్లాడారు. ఆలయంలో ఫారెస్టు వారు ఏ నిర్మాణాలైతే కూల్చారో ఆ నిర్మాణాన్ని తిరిగి కట్టిస్తామని, ధ్వంసమైన విగ్రహాలను రెండు మూడు రోజుల్లో తెప్పిస్తామని తెలిపారు. ఈ సమస్యని అర్థం చేసుకొని తొందరగా పరిష్కరించడంలో చొరవ చూపిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డికి భారతీయ జనతా పార్టీ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు పాలెం కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి బి.జయలక్ష్మి, మాజీ పట్టణ కో కన్వీనర్ గౌరీశంకర్, శివాలయం బోర్డు మెంబెర్ విక్రాంత్, స్టేట్ కౌన్సిల్ మెంబెర్ గురు ప్రసాద్, రూరల్ అధ్యక్షుడు మురళి, డిస్ట్రిక్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ రవి, వరం, సుధాకర్ పాల్గొన్నారు.

## పండుగ రోజున యాక్షన్ ప్లాన్ మినహాయించాలి

**ఎడ్యుకేషన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**

మార్చిలో జరగబోయే 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచే ఉద్దేశంతో ఉన్నత పాఠశాలల్లో అమలుపరుస్తున్న వంద రోజులు యాక్షన్ ప్లాన్‌లో మహాశివరాత్రి పండుగ రోజున కూడా సెలవు ఇవ్వకుండా అదనపు తరగతులు జరపడం అనేది సమంజసం కాదని, ఆ రోజు కచ్చితంగా తరగతులు లేకుండా మినహాయింపు ఇవ్వాలని ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా వారంలో ఆరు రోజులు పాటు పాఠశాల విధులకు హాజరవుతూనే సెలవు రోజుల్లో కూడా విరామం లేకుండా పనిచేస్తున్న ఉపాధ్యాయులను పండుగ రోజు కూడా ఇంటి దగ్గర లేకుండా పాఠశాలకు పంపడం అనేది సమర్ధనీయం కాదన్నారు. కావున ప్రభుత్వం ఆలోచించి కచ్చితంగా మహాశివరాత్రి పండగ రోజున అదనపు తరగతులలో లేకుండా మినహాయించవలసిందిగా వారు కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, మరియు ముఖ్యమైన కార్యకర్తలు పాల్గొన్నారు.

## విరబూసిన మామిడి

**సోమల ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త)**



మండలంలో ప్రధాన వాణిజ్య పంట అయిన మామిడి ఈ సంవత్సరం పూత విరబూయడంతో రైతుల ముఖంలో ఆనందం వెల్లువరిస్తుంది. సోమల మండలంలో దాదాపు 8 వేల ఎకరాలలో మామిడి చెట్లు ఉన్నాయి. గత రెండేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలను అధిగమించి దిగుబడును సాధించిన గిట్టుబాటు ధర లేకపోవడంతో తాము పండించిన పంటను రోడ్లపై పారబోసి నిరసన తెలిపే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ యేడు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం ప్రతి చెట్టు పూతకు రావడం ఆనందంగా ఉన్న దిగుబడి పెరిగితే కాయలు ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. ప్రభుత్వం దిగుబడులను ముందుగానే అంచనా వేసి రైతులను ఆదుకునేందుకు సరైన చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాల్సి ఉంది.

## వాల్టా చట్టం ఉల్టా

**సోమల ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త)**

ప్రజల కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసిన అవి అమలులోకి వచ్చే సమయానికి అక్రమార్జన పరులకు చుట్టాలుగా మారుతున్నాయి. చట్టాలు పుస్తకాలికే పరిమితమవుతున్నాయి. ప్రకృతి సమతౌల్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం ఎంతో పకడ్బందీగా వాల్టా చట్టం తీసుకువచ్చింది. దీనివల్ల ఏ ఒక్క పచ్చని చెట్టు కూల్చకుండ పరిరక్షించి పచ్చదనాన్ని పెంపొందించ వచ్చని ప్రభుత్వం ఊహించింది. చట్టానికి పదును బెట్టి అధికారులకు కట్టబెట్టింది. వందలాది సంవత్సరాల పచ్చని చెట్లు కూలిపోతున్నాయి. పచ్చదనం లేక గ్రామాల స్వరూపాలే మారిపోతున్నాయి. పల్లెల్లో కూడా స్వచ్ఛమైన గాలి కోసం ప్రజలు వెతుక్కోవాల్సి వస్తోంది. లారీల్లో వెళుతున్న కలప గ్రామాలు దాటి మండలాల మీదుగా జిల్లా కేంద్రం దాటుకుని పక్క రాష్ట్రాలకు తరలుతున్న పట్టించుకుని నాధుడు కరువయ్యారు. ఇకనైనా అధికార గణం స్పందించి అక్రమ రవాణాలు అడ్డుకోకపోతే భావితరాలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంది

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు**

**మదనపల్లె, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**

వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో ముంచుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసిస్తూ ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదలకు ఆసరాగా ఉన్న మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి పేదల పొట్ట కొటే విబిజిఆర్ఎఎంజి పేరుతో కొత్త చట్టం తెచ్చిందన్నారు.కార్మిక వర్గం పోరాటాలతో సాధించుకొన్న 29చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించారని తెలిపారు. ప్రజావ్యతిరేక విధానలకు నిరసనగా చేపట్టే సార్వత్రిక సమ్మెకు గ్రామీణ పేద ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అనంతరం జిల్లా నాయకులు సుదీర్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, రామాంజులు, వీరభద్ర, సుధాకర్, నరసారెడ్డి, ఆంజినేయులు, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

## జాతీయ మాజీ అధ్యక్షులు మిట్టల్‌కు నివాళులు

**మదనపల్లె, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫరడేషన్ జాతీయ మాజీ అధ్యక్షులు మిట్టల్‌కు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెలో అధ్యక్షులు డాక్టర్ మునిగోపాలక్రిష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించి నివాళులర్పించారు. కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి యుస్మాన్‌సాహెబ్, సలహాదారుడు డాక్టర్ గొల్లపూడి తిరుపతి రావులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మునిగోపాలక్రిష్ణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి జాతీయ మాజీ అధ్యక్షులు మిట్టల్ అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ సిటిజన్ నాయకులు పాల్గొన్నారు.

## బెంగుళూరు మైక్రోసాఫ్ట్ కంపెనీ సందర్శన


మైక్రో కంపెనీని సందర్శించిన విద్యార్థులు

**కురబలకోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**

మండలం అంగళ్ళుకు సమీపంలోని మిట్స్ డీమ్డ్ టుబి యూనివర్శిటిలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బిటెక్ రెండో సంవత్సరం డేటా సైన్స్‌కు చెందిన 70మంది విద్యార్థులు, అధ్యాపకుల బృందం కలిసి ఇండస్ట్రీయల్ విజిట్‌లోభాగంగా బెంగుళూరులోని మైక్రోసాఫ్ట్ కంపెనీని సందర్శించారు. విద్యార్థులకు పరిశ్రమ అనుభవం, పరిశోధనలపై అవగాహన అందించడమే విజిట్ ప్రధానలక్ష్యంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్‌లో డేటా అనలిటిక్స్ మేజర్‌గా సిగ్నిక్ బెనర్జీ డేటా అనలిటెక్స్, కృత్రిమ మేధస్సు, క్లౌడ్ టెక్నాలజీలు వంటి తాజ సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహనాత్మకమైన, ఇంటరాక్టివ్ సేషన్ నిర్వహించారు. విద్యార్థులు నూతన జెనరేటివ్ ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకొని, భవిష్యత్తు కెరేర్‌కు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.కిరణ్, రూపా మంజుల, డాక్టర్ జి.కిరణ్‌కుమార్‌ల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టండి

**మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి**

**మదనపల్లె, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**


సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్

కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. ఆదివారం రూరల్ మండలంలోని మాలేపాడు, పెంచుపాడు గ్రామ పంచాయతీల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి నూతన కమిటీలను ఎన్నుకొన్నారు. మదనపల్లెలో వైసిపి సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా పార్టీ అధిష్టానం పిలుపు మేరకు రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా పార్టీ పరిశీలకులు మనూజారెడ్డి, నియోజకవర్గ యవజన విభాగం అధ్యక్షులు, రూరల్ మండల పరిశీలకులు హర్షవర్ధన్‌రెడ్డిలు మాట్లాడుతూ వచ్చే స్థానిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలుపొందేందుకు కృషి చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు పార్టీని బలోపేతం చేసి కూటమి ప్రభుత్వాన్ని ఎదుర్కొవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు రెడ్డిపల్లి సుదర్శన్‌రెడ్డి, నరసింహులు, మాలేపాడు సర్పంచ్ గణేష్, ఎంపిటిసిలు ఈశ్వరమ్మ, సుబ్బలక్ష్మి, దండు క్రిష్ణారెడ్డి, మనోహర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రమ్మ పార్ధీవదేహానికి నివాళులు

**సిద్ధవటం ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**



గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందిన టిడిపి అసెంబ్లీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సిగోల్ల క్రిష్ణయ్య యాదవ్ తల్లి సావిత్రమ్మ మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు విచ్చేసి సావిత్రమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం క్రిష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి రాజంపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తల్లి సావిత్రమ్మ గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట జెడ్పిటిసి ముద్దుకృష్ణ రెడ్డి ఏపీ పంచాయతీరాజ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య సిద్ధవటం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్ మాజీ జెడ్పిటిసి చలమయ్య యాదవ్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాసనాయుడు సుబ్బయ్య యాదవ్ టిడిపి నేతలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరి పాటించాలి

**సిద్ధవటం ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**



వాహదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించి వాహనాలు నడపాలని మండల ఎస్సై హారిక తెలిపారు ద్విచక్రవాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మాధవరం గ్రామం పార్వతీపురం శీతల గంగమ్మ గుడివద్ద ఆదివారం రాత్రి వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై హారిక మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు కి హెల్మెట్, వాహన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామంలో సంచరిస్తే సమాచారం తెలపాలని గ్రామంలో ప్రశాంతత వాతావరణ ఉండేటట్టు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్ఐ సూచించారు ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమణయ్య శివ ప్రదీప్ పాల్గొన్నారు.

## నేడు అంగళ్లులో ఉరుసు మహోత్సవం

**కురబలకోట. ఫిబ్రవరి 8 ప్రభాతవార్త.**



కురబలకోట మండలం అంగళ్లు లోని హై స్కూల్ వద్ద దర్గా సయ్య దీన షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని పీరాన్ పీర్ కౌశల్ గౌసుల్ ఆజాం దస్తగిరి దస్తగీర్ ఉరుసు ఉత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు ఎల్. నబీ సాబ్,ఎస్ రహమతుల్లాలు తెలిపారు. సోమవారం రాత్రి గంధం, మంగళవారం ఉరుసు నిర్వహిస్తామని తెలిపారు. అదే రోజు రాత్రి కవ్వాలి పాటల పోటీలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అంగళ్ల గ్రామ హిందూ ,ముస్లిం సోదరులు ప్రఅందరూ పాల్గొనాలని వారు కోరారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల పర్వతారోహణ, ట్రెక్కింగ్





**రాయచోటి టౌన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రెటరీ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో 400 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు హార్సిలీ హిల్స్ నందు ఆదివారం ఉదయం ట్రెక్కింగ్ ను నిర్వహించారు. స్కౌట్స్ విద్యా విషయక క్యాలెండర్ ప్రకారం విద్యార్థులలో ధైర్య సాహసాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు పర్వతారోహణ, ట్రెక్కింగ్ ను నిర్వహించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం పర్యావరణాన్ని కాపాడుకుంటూ ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించడానికి ర్యాలీ చేపట్టారు. అనంతరం గాలిబండ పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను, గాజు ముక్కలను ఏరివేసి శుభ్రపరిచారు. అనంతరం హార్సిలీ హిల్స్ లోని స్కౌట్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో స్కౌట్ సెక్రెటరీ మాట్లాడుతూ 1959 మే 23న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ భీమసేన్ సాచర్ హార్సిలీ హిల్స్ నందు ఈ శిక్షణ కేంద్రానికి స్థలాన్ని కేటాయించడం జరిగిందని వివరించారు. అప్పటినుండి 8 జిల్లాలకు చెందిన రాయలసీమ విద్యార్థులే కాకుండా దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు కూడా ఇక్కడ శిక్షణ పొందడం జరుగుతోందని వారు తెలిపారు. శిక్షణ కేంద్రం నందు ప్రస్తుతం ఉన్న భవనాలు కూలిపోయే దశలో ఉన్నందున నూతన భవనాల నిర్మాణం చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. ప్రహరీ గోడ నిర్మాణానికి, స్కౌట్ భవనానికి నీటి సరఫరాను పునరుద్ధరించడానికి అధికారులకు విన్నవించినట్లు తీర్మానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పిరమిడ్ విన్యాసాలు పలువురిని ఆకర్షించాయి. సాంస్కృతిక కార్యక్రమాలలో, పిరమిడ్ విన్యాసాలలో, పర్వతారోహణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యూ బి లక్ష్మీకర్, అసిస్టెంట్ సెక్రెటరీ భాస్కర్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు సిద్దారెడ్డి, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం..

**సుండుపల్లె, ఫిబ్రవరి 08,(ప్రభాతవార్త :**

మండల పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాల నందు మానవత సుండుపల్లె వారి ఆధ్వర్యంలో కడప విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి దాదాపు 150 మంది వ్యాధి గ్రస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించడం జరిగిందని వారికి కావలసిన మందులు ఇవ్వడం జరిగిందని మానవత చైర్మన్ గంగిరెడ్డి తెలియజేసారు. తీసుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో సుండుపల్లె మానవతా డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, ఉమ్మడి కడప జిల్లా ఆర్థిక కార్యదర్శి హరికుమార్ ,భీమ్లా నాయక్ ,ప్రకాష్ నాయక్ ,నరసింహులు ,నాగేశ్వర మరియు మన కుటుంబ సభ్యులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు




## కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం



**బద్వేల్ అర్బన్, ఫిబ్రవరి 8:, ప్రభాతవార్త**

పట్టణంలోని శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ పీజీ (అటానమస్) కళాశాలలో పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల పరిపాలన అధికారి రాచపుడి వెంకట సాయి కృష్ణ పరిశీలించి మాట్లాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని, సేవాభావంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు కళాశాల యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగిరి కంటి ఆసుపత్రి అధికారి డా. సూర్య ప్రకాష్ మాట్లాడుతూ, సమాజానికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు చెప్పారు. శిబిరంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు డా. మనశ్విని పాల్గొని దాదాపు 200 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిచూపు లోపాలు, ము త్యబిందు (కాటరాక్ట్), గ్లాకోమా, రెటినా సంబంధిత సమస్యలు, షుగర్ వల్ల వచ్చే కంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయడంతో పాటు శస్త్రచికిత్స అవ సరమైన రోగులను పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు.ఈ కార్యక్రమం లో రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల లో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా వినోద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ బాల ఓబులేసు, పారా మెడికల్ ఇంచార్జి షాహిన, తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండపై పెరిగిన భక్తుల రద్దీ



**బోయకొండ(చౌడేపల్లి) ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కొండ భక్తజన సంద్రమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. విఐపిల దాకిడి అధికం కావడంతో సామాన్య భక్తులు ఇబ్బందులు పడ్డారు. కొండ దినాన్ని పురస్కరించుకొని అర్చక, వేదపండితులు అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ నిర్వహించారు. ఇఓ, ఉపకమీషనర్ భక్తులకు మౌళిక వసతులు కల్పించారు. అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకుల సేవలో నిమగ్నమయ్యారు.

# పిల్లలు చదువుతోపాటు గోల్ సాధించడమే లక్ష్యం





**పీలేరు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:**

పిల్లలు చదువుతోపాటు లక్ష్య సాధన వైపుకు అడుగులు వేయాలని మదనపల్లి ఇంచార్జ్ డివైఈవో, పీలేరు మండల విద్యాశాఖ అధికారి వై. లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. శ్రీ భువన విద్యాలయం 17వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం శ్రీ భువన విద్యాలయం ప్రాంగణంలో కరస్పాండెంట్ జి. ఉమా రమాదేవి, ప్రిన్సిపాల్ గుణలక్ష్మి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంచార్జ్ డివైఈవో మాట్లాడుతూ విద్యార్థులు నూతన శాస్త్ర, సాంకేతిక, విద్య, వైద్య, వైజ్ఞానిక, ఇతర రంగాల్లో చోటు చేసుకుంటున్న కొత్త కొత్త మార్పులకు తగినట్టుగా తమలోని సృజనాత్మకతకు పదును పెడుతూ మంచి విజ్ఞానవంతులుగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం 2024 25 విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభా పురస్కారాలను అందుకున్న భుక్యా హ్యాందహాసిని, ఎస్. సనా లను అభినందిస్తూ వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ ఈవెంట్స్ సన్నీ మాస్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ రకాల నృత్యాలు, కళాకార్ హబ్ ఆధ్వర్యంలో పలు రకాల నాటికలు ప్రదర్శించారు. అదేవిధంగా గణితంలో అబాకస్, రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ప్రదర్శనలు, కరాటే విన్యాసాలను కూడా విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిభా పురస్కారాల గ్రహీతల తల్లిదండ్రులు భుక్యా అమరేంద్ర నాయక్ దంపతులు, అల్తాఫ్ దంపతులు, సుమారు 5000 మందికి పైగా శ్రీ భువన విద్యాలయం విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఆస్తుల పరిరక్షణకు ఉద్యమం..



**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:**

కార్పొరేషన్ ఆస్తులను ప్రైవేటుపరం చేయడం తగదని దళిత నాయకులు సిఆర్వి ప్రసాద్, అయ్యవారయ్య తెలిపారు. ఆదివారం కడప లో వారు మీడియాతో మాట్లాడుతూ కడప నగరంలోని నేక్ నామ్ కళాక్షేత్రము, వైఎస్ఆర్ ఆడిటోరియం, పాత మున్సిపల్ ఆఫీస్ స్థలాన్ని, వై జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ భవనాన్ని, కార్పొరేషన్ అధికారులు, మేయర్ కలిసి ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. వీటి విలువ ఎక్కువ ఉన్నదని.. వాటిని ప్రైవేటుపరం చేయడానికి పోటీపడుతున్నారని విమర్శించారు. కార్పొరేషన్ అధికారులు ప్రైవేటుపరం చేయడానికి ఉత్సాహ పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నాలుగు స్థలాలు పేద ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు. వైఎస్ఆర్ ఆడిటోరియం పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు ఉపయోగపడు తున్నాయని తెలిపారు. అంబేద్కర్ భవనం దళిత వర్గాలకు ఉపయోగపడుతుంది. నేక్ నామ్ కళాక్షేత్రం చేనేత వర్గాలకు కళాకారులకు ఉపయోగపడు తున్నాయని తెలిపారు. ప్రైవేట్ పరం చేయడాన్ని విరమించుకోవాలన్నారు. లేనియెడల ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి, భాస్కర్, జేవి రమణ, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, పాల్గొన్నారు.

## శ్రీశక్తి పథకంతో లాభాల వైపు ఆర్టీసి

### మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**మదనపల్లె, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**

ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పేరుతో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రీశక్తి పథకంతో ఆర్టీసి లాబాల వైపు పయనిస్తోందని నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజులు తెలిపారు. పట్టణంలోని ఎన్‌విఆర్ కళ్యాణ మండపంలో అసోసియేషన్ ద్వితీయ మహాసభ నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిధులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన శ్రీశక్తి పథకాన్ని ఆర్టీసి సిబ్బంది చాలా చక్కగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వానికి మంచిపేరు వచ్చే విధంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసి సంస్థ నందు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కొంత మంది అధికారుల వైఖరి చాలా ఉదాసీనంగా ఉందన్నారు. చిన్న చిన్న కారణాలతో ఉద్యోగులను వేధింపులకు గురిచేయడం, అక్రమంగా విధులు నుంచి సస్పెండ్ చేయడం జరుగుతోందన్నారు. వాటిపై ప్రభుత్వం జోక్యం చేసుకొని ఉద్యోగికి భద్రత కల్పించాలన్నారు. ఈసందర్భంగా రెండు డిపోల ఎంప్లాయిస్ యూనియన్, వైఎస్ఆర్ యూనియన్‌లకు రాజీనామా చేసి నూరుమంది సభ్యులు నేషనల్ మజ్దూర్ యూనియన్‌లో సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరి, రమణ, జోనల్ అధ్యక్షులు పి.వినోద్, జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యంరాజు, జిల్లాలోని అన్ని డిపోలనుంచి పాల్గొన్నారు.

## కడప జిల్లా సాఫ్ట్ బాల్

### అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**రాజంపేట,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**

కడప జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. రాజంపేట అతిధి గృహంలో జరిగిన ఈ ఎన్నికలో డి. సుధాకర్ యాదవ్ (ఛైర్మన్), శ్రీకాంత్ రెడ్డి (ప్రెసిడెంట్), రామసుబ్బారెడ్డి (సెక్రటరీ), పి శివకుమార్ (ట్రెజరర్), రామకృష్ణారెడ్డి (జాయింట్ సెక్రెటరీ), జగదీశ్వరయ్య (జాయింట్ సెక్రెటరీ), శివ శంకర్ రెడ్డి (వైస్ ప్రెసిడెంట్),జేసునాథ్ రెడ్డి(ఈసీ మెంబర్), పి కళ్యాణ్ (ఈసీ మెంబర్), బి. పద్మావతి (ఈసీ మెంబర్), సివి రమణారెడ్డి (ఈసీ మెంబర్), అరుణ కుమారి (ఈసీ మెంబర్), శివాజీ నాయక్ (వర్కింగ్ ప్రెసిడెంట్), ఆర్గనైజింగ్ సెక్రటరీ (సుబ్రహ్మణ్యం) లు ఎంపికయ్యారు. సాఫ్ట్ బాల్ అభివృద్ధికి కృషి చేస్తాంకష్టపడే క్రీడాకారులకు కే మా మద్దతు, అందరి మద్దతుతో సాఫ్ట్ బాల్ క్రీడలో రాష్ట్రంలోనే కడప జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలుపుతామని కడప జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు లు తెలియజేశారు. ఈ కార్యవర్గం ఎన్నికలను రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ తరపున అబ్జర్వర్లుగా రామకృష్ణ (సత్య సాయి జిల్లా), విజయ్ (కర్నూల్), కామేశ్వరమ్మ (నెల్లూరు) వ్యవహరించారు.ఈ ఎన్నికకు కడప జిల్లా డిఎస్డివో పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. భారీగా తరలివచ్చిన సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల సమక్షంలో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటి అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్, మాజీ వ్యాయామ ఉపాధ్యాయులు షామీర్ భాష, టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ తో పాటు వివిధ ప్రాంతాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులు ఫార్మసీ రిజిస్టర్‌లో నమోదు చేసుకోండి

**దువ్వూరు, ఫిబ్రవరి 08, ప్రభాతవార్త:**

మండలంలోని రైతులు సంక్షేమ పథకాల జీవనాడి అయిన రైతన్న బడిలో తమ పేరు నమోదు చేసుకొని ఫార్మసీ ఐడి పొందాలని మండల వ్యవసాయ అధికారి అమర్ నాధ్ రెడ్డి తెలిపారు. ఈ ఫార్మసీ ఐడిని రైతులు తమ సెల్ ఫోన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవచ్చు అని అలా కాకపోతే సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి చేసుకోవాలి అన్నారు. అక్కడ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ నెంబర్, సెల్ నెంబర్ తీసుకుని వెళ్తే రైతు సేవా కేంద్రంలో ఉండే సిబ్బంది నమోదు చేస్తారన్నారు. ఇలా నమోదు చేయడం వల్ల రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే సంక్షేమ పథకాలు, పీఎం కిసాన్, పంటల భీమా, ఇతర వ్యవసాయ పరికరాలు అందుతాయి అన్నారు. రైతు ఐడి నెంబర్ వ్యవసాయ భవిష్యత్తుకు పునాది వంటిదని, తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమర్ నాధ్ రెడ్డి తెలిపారు.

## పశువుల హాస్టల్‌కు భూమి పూజ

**ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు నియోజకవర్గం కామనూరు గ్రామం నందు వేణుగోపాల స్వామి గోశాల వద్ద మహాత్మా గాంధీ ఎన్ఆర్ఇజిఎస్ నిధులు 10 లక్షల రూపాయల వ్యయంతో పశువుల హాస్టల్ కు ఆదివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి కేసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ధనిరెడ్డి రామచంద్రా రెడ్డి, బద్రిపల్లె స్వామి, ఏపీవో మహేశ్వర రెడ్డి,ఇంజనీర్ విజయ్ కుమార్ రెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## బద్వేల్‌లో మద్యం విషయమై ఘర్షణ

### ఇరువర్గాలపై పరస్పర దాడులు -



**బద్వేల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త**

బద్వేల్ పట్టణంలోని నెల్లూరు రోడ్డు కార్తీక్ వైన్ షాప్ వద్ద మద్యం విషయమై జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో వైన్ షాప్ యజమాని విష్ణువర్ధన్ రెడ్డి, రామిరెడ్డి అనే వ్యక్తిపై దాడి చేసినట్లు సమాచారం. దాడి అనంతరం రామిరెడ్డి తన బంధువులతో కలిసి పట్టణంలోని పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి వైన్ షాప్ యజమాని విష్ణువర్ధన్ రెడ్డి పై పరస్పర దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘర్షణలో ఇరువురికి రక్త గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గొడవను అదుపులోకి తీసుకువచ్చారు. గాయపడిన ఇరువురిని చికిత్స నిమిత్తం బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సమాచారం.

## టెర్రకోటలకు జీఐ ట్యాగ్ కోసం దరఖాస్తు



**కురబలకోట ఫిబ్రవరి 8 ప్రభాతవార్త**

మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ, మదనపల్లె లోని మిట్స్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ మదనపల్లె టెర్రకోట మరియు కుండల తయారీలకు భౌగోళిక సూచిక (జీఐ) ట్యాగ్ కోసం చెన్నై జీఐ రిజిస్ట్రీకి సమర్పించినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. చేతితో తయారు చేయబడిన ఉపయోగపడే మరియు అలంకరణ మట్టి పాత్రలకు ప్రసిద్ధి చెందిన మదనపల్లె యొక్క టెర్రకోట మరియు కుండల తయారీ కి మదనపల్లె ఒక ప్రత్యేక కేంద్రం అని అన్నారు. మదనపల్లె టెర్రకోట్‌టా మరియు కుండల దరఖాస్తును మదర్ ఇండియా టెర్రకోట్‌టా ఆర్టిసాన్స్ మ్యూచువల్లీ ఎయిడ్ కోఆపరేటివ్ సొసైటీ తరుపున దాఖలు చేసినట్లు ఆయన అన్నారు. చేతివృత్తులవారు మన్నిక కోసం రెండు నుండి మూడు బంకమట్టిని కలుపుతారు అని ఆయన అన్నారు. సందర్భంగా యూనివర్సిటీ మిట్స్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ మరియు మిట్స్ ఆర్‌డి సెల్ యొక్క చురుకైన ప్రయత్నాలను మిట్స్ యూనివర్సిటీ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి అభినందించారు. ఈ కార్యక్రమం లో అడ్వైసర్ తులసిరామ్ నాయుడు, అసోసియేట్ డీన్ డాక్టర్ పి. శివయ్య, అధ్యాపక సభ్యులు పాల్గొన్నారు.

# పప్పు శనిగ కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

**వేంపల్లి:ఫిబ్రవరి 08 ప్రభాతవార్త**

ప్రభుత్వం పప్పు శనిగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, యూరియా కొరత లేకుండా చూడాలని,రసాయన ఎరువుల ధరలు తగ్గించాలని రాజ్య సభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పులివెందుల నియోజకవర్గం వేంపల్లి మండల కేంద్రంలో పప్పు శనిగ పంటను కాంగ్రెస్ నాయకులతో కలిసి తులసి రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ, ప్రకాశం జిల్లాలో పప్పు శనిగ రబీ సీజన్లో ప్రధానమైన పంటని, దాదాపు 11 లక్షల 50 వేల ఎకరాల్లో బుడ్డ శనిగ పంట వేశారని తులసి రెడ్డి అన్నారు.ఈ సంవత్సరం పంట దిగుబడి బాగానే వచ్చింది. కానీ ధరలేనందువల్ల రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు 5875 రూపాయలు. కానీ మార్కెట్లో వ్యాపారులు క్వింటాల్కు 5000 రూపాయల నుంచి 5400 మధ్యన కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు క్వింటాలు మీద ఐదు కేజీలు అదనంగా తీసుకుంటున్నారు దీనివలన ఒక్కొక్క క్వింటాల మీద రైతులు ఎనిమిది వందల రూపాయలు నష్టపోతున్నారు. ప్రభుత్వము ఇంతవరకు ఒక్క కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ప్రభుత్వం పప్పు శనిగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు కనీస మద్దతులను కల్పించి రైతులను ఆదుకోవాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.



వరి, అరటి,నువ్వు తదితర పంటలకు ప్రస్తుతం యూరియా అవసరముంది. కానీ రైతు సేవా కేంద్రాల్లోగాని, ప్రైవేటు ఎరువుల దుకాణాలలో గానీ యూరియా లభించడం లేదు.వెంటనే రాష్ట్ర ప్రభుత్వం యూరియా కొరత లేకుండా రైతులకు కావలసిన మేరకు సరఫరా చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బండారు వెంకటేశు, బద్రీనాథ్ వినయ్, రైతు నాగిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ వ్యవస్థ మరింత పటిష్టం..

**సుండుపల్లి ,ఫిబ్రవరి 08,ప్రభాతవార్త :**



మండ్నలలోని నూతనంగా ఏర్పాటు చేసిన సర్కిల్ కార్యాలయాన్ని సర్కిల్ ఇన్స్పెక్టర్ మస్తాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుండుపల్లి సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖతో సహకరించి, చట్టాన్ని గౌరవిస్తూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. నూతన సర్కిల్ కార్యాలయం ప్రారంభంతో పోలీస్ సేవలు మరింత సమర్థవంతంగా ప్రజలకు అందనున్నాయని అధికారులు తెలిపారు.

## 108లో కవల పిల్లలు ప్రసవం

**పీలేరు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:**



పీలేరు మండలం కావలి పల్లికి చెందిన రాములమ్మను అత్యవసర చికిత్స కోసం 108 అంబులెన్స్ లో పీలేరు నుంచి తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కవల పిల్లలకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది సమయస్ఫూర్తితో స్పందించి సురక్షితంగా ప్రసవం ఈఎంటి అశోక్ జరిపారు. తల్లి, కవల శిశువులు ఆరోగ్యంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన 108 సేవల ప్రాధాన్యతను మరోసారి చాటింది. ఉద్యోగులు ఈఎంటి అశోక్. పైలెట్ శ్రీనివాసులు ను పలువురు అభినందించారు.

## కుప్పం కృష్ణారెడ్డి భౌతికకాయానికి నివాళు

**చిన్నమండెం పిబ్రవరి 8 ప్రబాతవార్త:**



మండలంలోని కొత్తపల్లి గ్రామం, నేరళ్లవంకలో గల మండిపల్లి కుటుంబ వీరాభిమాని కుప్పం కృష్ణారెడ్డి అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మేనల్లుడు మిన్నంరెడ్డి మోర్యారెడ్డి ఆదివారం వారి ఇంటి దగ్గరకు వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు .ఈ కార్యక్రమంలో మండల,గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి కరపత్రాలను విడుదల చేసిన ఎమ్మెల్యే

**ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 8 ప్రభాత వార్త**

ఆదివారం మండలంలోని కామనూరు గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను కలిసి ఆయన చేతుల మీదుగా మహా శివరాత్రి కరపత్రాలను విడుదల చేశారు. ఆలయ అభివృద్ధి మరియు మహాశివరాత్రి ఉత్సవాల గురించి వివరించారు. ఆలయ అభివృద్ధికి ఎల్లవేళలా తన సహాయ సహకారములు అందిస్తానని శాసనసభ్యులు తెలిపారు.



## మంచినీటి సమస్య పరిష్కారం

**కలికిరి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ మర్రికుంటపల్లె మెయిన్ రోడ్డులో నెలకొన్న మంచినీటి సమస్యను స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ పంచాయతీ కార్యదర్శి వి.గంగాదేవీలు పరిష్కరించడం జరిగింది. గ్రామంలోని రక్షిత మంచినీటి బోరు మోటారు మరమ్మతులకు గురైంది. సమస్యను స్థానికులు సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో సర్పంచ్ వెంటనే స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో మోటారుకు మరమ్మతులు చేయించి గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించడం జరిగింది. పంచాయతీలోని గ్రామాల్లో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతూ గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ తెలిపారు. ఇప్పటికే పంచాయతీలోని అన్ని గ్రామాల్లో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో కొత్తబోర్లు, మోటార్లు, పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు.